


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 10.07.2026 | సంపుటి: 3 | సంచిక: 158 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 10.07.2026 | V0LUME : 3 | ISSUE : 158 | PAGES: 8 | COST: 2/- |

## మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345 కోట్ల ఆమోదం

- తొలి దశ పనులకు పరిపాలనా అనుమతి
- 21 కిలోమీటర్ల ప్రాధాన్య కారిడార్ అభివృద్ధి
- ఏడీబీ రుణంతో ప్రాజెక్టు అమలు
- ఈపీసీ విధానంలో పనులు చేపట్టనున్న ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 9
"హైదరాబాద్ నగర ప్రతిష్ఠను పెంచే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తొలి దశ పనులకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేశాం. ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం" అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు

మిగతా 2వ పేజీలో..





గురుకులాల్లో పార్ట్ టైం
## గందరగోళం

- ఆరు రోజులకే ఉద్యోగాల తొలగింపు!
- పని భారం బారెడు.. జీతం జానెడు!
- నిరుద్యోగుల జీవితాలతో అధికారుల చెలగాటం..
- న్యాయం చేయాలంటూ బాధితుల ఆవేదన

హైదరాబాద్/ సిద్దిపేట, జూలై 9:
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ రోజురోజుకూ దిగజారుతుండటంతో.. చేతిలో డిగ్రీలు పట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోంది. రాష్ట్రంలో మెరుగైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యా ప్రమాణాలు నానాటికీ పడిపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెగ్యులర్ ఉపాధ్యాయుల కొరత ఉండటంతో, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం పార్ట్ టైం అధ్యాపకుల నియామకాలకు తెరలేపింది. అయితే, ఈ నియామక ప్రక్రియ నిరుద్యోగుల జీవితాల్లో తీవ్ర నిరాశను, గందరగోళాన్ని మిగిల్చింది.

మిగతా 3వ పేజీలో..



హైదరాబాద్, జూలై8(రాజముద్ర న్యూస్)

# తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు
- హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు
- ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సిఎం రేవంత్

హైదరాబాద్, జూలై9( రాజముద్ర న్యూస్):
తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్టస్ జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది

మిగతా 2వ పేజీలో..

హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణే నా కల 02



కాంగ్రెస్ పార్టీ పని
## అయిపోయినట్లే

- రేవంత్ సొంత సర్వేలోనూ ఇదే తేలింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02



## కమిషన్లతోనే కాలం వెళ్లదీస్తోన్న కాంగ్రెస్

- కాళేశ్వరం కూలితే గోదావరి జలాలు ఎలా వచ్చాయి?
- బీఆర్ఎస్‌పై బురద చల్లడమే లక్ష్యం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

03

## 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా

- రాష్ట్ర చరిత్రలోనే ఈ వేదిక అతిపెద్ద రైతు ఆశీర్వాద సభ
- కాంగ్రెస్ ప్రాజెక్టులు బాగున్నాయి
- బిఆర్ఎస్ ప్రాజెక్టులు కూలుతున్నాయి
- మెగా రైతు మేళాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- 150 స్టాల్స్ ఏర్పాటు
- అంచనాలకు మించి రైతుల హాజరు

03



## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- వాతావరణ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి
- ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

02




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి
- స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన పరిశ్రమల యాజమాన్యాలు

02





## బండి సాయి భగీరథ్‌కు షరతులతో బెయిల్

- పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు

02

## బీఆర్ఎస్ ఖాతాలోని రూ.1,400 కోట్లపై విచారణ జరపాలి

- ఆ నిధులు క్విడ్ ప్రోకో ద్వారానే వచ్చాయి
- ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి
- మళ్లీ బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తే లేదు: కవిత

కొత్తగూడెం, జూలై9( రాజముద్ర న్యూస్):
"బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవే. ఆ నిధులపై సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల

మిగతా 3వ పేజీలో..





## 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- టెన్త్ మార్కులతోనే ఆర్టీసీలో ఉద్యోగం

03

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**హైదరాబాద్, జూలై 9:** ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతాంగం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతులు భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న వర్షపాతం అంచనాలు, హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చే మార్గదర్శకాలనే అనుసరించాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయ కార్యాచరణపై సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా వారీ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, సాగునీటి లభ్యతను నిరంతరం సమీక్షించి, వాటికి అనుగుణంగానే పంటల ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, గ్రామ సభలు, రైతు వేదికలు, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృతంగా వివరించాలని సూచించారు. వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి శాస్త్రీయ సమాచారాన్ని వేగంగా రైతులకు చేరవేయాలని చెప్పారు. ఏ ప్రాంతంలో ఏ పంట అనుకూలమో శాస్త్రవేత్తల సిఫారసుల ఆధారంగా రైతులకు స్పష్టమైన సలహాలు అందించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో ఉన్న వాస్తవ నీటి నిల్వలపై రైతులకు పారదర్శక సమాచారం అందించి, నీటి లభ్యతకు అనుగుణంగానే సాగు ప్రణాళికలు రూపొందించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలు ప్రారంభమైన వెంటనే శ్రీపాద ఎల్లంపల్లి సహా గోదావరి బేసిన్‌లోని ప్రధాన జలాశయాలను సమర్థవంతంగా నింపేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎల్‌నీనో సవాళ్లను శాస్త్రీయ ప్రణాళికతో ఎదుర్కొని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తున్నదని పునరుద్ఘాటించారు. ఐటీ, పరిశ్రమల శాU మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఈఎన్‌సి రమేష్ బాబు, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లు పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజులు పాల్గొన్నారు.

# తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**మొదటిపేజీ తరువాయి**

యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 టర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**'మేడ్ ఇన్ తెలంగాణ' విశ్వవ్యాప్తం కావాలి : మంత్రి దుద్దిళ్ల**

'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఇక్కడినుంచే ప్రపంచానికి ఉత్పత్తులను అందించాలి.. ఇదే ప్రభుత్వ సంకల్పం అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. 'ప్రీమియర్ ఎనర్జీస' లాంటి ప్రపంచస్థాయి సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు తెలంగాణను ఎంచుకోవడం ఇక్కడి పారిశ్రామిక ప్రగతికి, రాష్ట్ర ప్రభుత్వంపై ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. 'తెలంగాణ రైజింగ్2047' విజన్ ద్వారా తెలంగాణను ప్రపంచస్థాయి క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇన్నోవేషన్, సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పునరుత్పాదక ఇంధనం, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. ఇంధన రంగంలో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 3.4 ట్రిలియన్ డాలర్ల పెట్టబడులు వచ్చే అవకాశం ఉండగా అందులో మూడింట రెండొంతులు (2.2 ట్రిలియన్ డాలర్లు) క్లీన్ ఎనర్జీ రంగంలోనే వస్తాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా వేస్తోందన్నారు. ఏఐ, డేటా సెంటర్లు, ఈవీ రంగాల విస్తరణ వల్ల వచ్చే ఏడాది దేశీయ విద్యుత్ డిమాండ్ 300 గిగావాట్లకు చేరే అవకాశముందని కేంద్రం అంచనా వేస్తోందని తెలిపారు. దేశంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల పైప్‌లైన్ 260 గిగావాట్ అవర్స్‌కు చేరుకుందన్నారు. ఈ అవకాశాలను తెలంగాణ అందిపుచ్చుకునేలా ముఖ్యంగా సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ టెక్నాలజీపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన వివరించారు. ఈ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా కొత్త పెట్టుబడులను ఆకర్షించేలా సమగ్ర ఎకో సిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ అంటే విజన్, అవకాశాల కలయిక. ఆలోచనలు పరిశ్రమలుగా మారే వేదిక. నమ్మకానికి, వేగవంతమైన వృద్ధికి నిదర్శనం అని పేర్కొన్నారు. పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలం.. అందుకే తెలంగాణలో పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని పారిశ్రామికవేత్తలను ఈ వేదిక ద్వారా సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను దశలవారీగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని, సీతారాంపూర్‌లో భూములు ఇచ్చిన రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.7,345 కోట్ల ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

తొలి దశలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూసేకరణ వ్యయాన్ని మినహాయించి రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరైంది. ఈ నిధులతో ప్రాధాన్య కారిడార్లలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టు కింద మొత్తం 21 కిలోమీటర్ల ప్రాధాన్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందులో హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కిలోమీటర్లు, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కిలోమీటర్ల మేర జోన్1ఏ, జోన్1బీ కారిడార్లలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధుల్లో రూ.4,500 కోట్లను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) రుణంగా అందించనుంది. మిగిలిన రూ.2,845.12 కోట్లను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), తెలంగాణ గ్లోబల్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) రుణాల ద్వారా సమకూర్చనున్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను ఈపీసీ (ఇంజనీరింగ్-ప్రొక్యూర్మెంట్-కన్‌స్ట్రక్షన్) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు అమలును పర్యవేక్షించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (పీఎంసీ) నియామకానికి కూడా ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లు, కొనుగోలు ప్రక్రియ మొత్తం ఆసియా అభివృద్ధి బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే తదుపరి చర్యలను వేగవంతంగా చేపట్టి ప్రాజెక్టు అమలును ముందుకు తీసుకెళ్లాలని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)కు ఆదేశాలు జారీ చేసింది.

## కాంగ్రెస్ పార్టీ పని అయిపోయినట్లే

**హైదరాబాద్, జూలై 9 :** కాంగ్రెస్ పార్టీ సగం పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో తన పాలనపైన, తన నాయకత్వంపైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్తృత సర్వే చేయించుకున్నారని, అందులో ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో పార్టీ హైదరాబాద్ నేతలతో గురువారం జరిగిన ప్రత్యక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆరఎస్ సుమారు 78 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ సర్వేలో తేలిందన్నారు. రెండు మీడియా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ విభాగాలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే అంశం వ్యక్తమైందన్నారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నామని ప్రజలు స్పష్టంగా తమ అభిప్రాయం తెల్చిచెప్పారన్నారు. సొంత సర్వేతోపాటు పలు సర్వేల్లో వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే మరోసారి ముఖ్యమంత్రి వారం రోజులుగా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. గురువారం నిర్వహించారు. తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ అనేక అటెన్షన్ డైవర్షన్ పనులు చేస్తున్నారని, అందులో భాగంగానే కాళేశ్వరం నుంచి రైతుబంధు వరకు అన్నింటిపైన అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైనందువల్లనే రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పాలనపై నమ్మకం కోల్పోయారన్నారు. దీంతో ఆ పార్టీకి ప్రత్యామ్నాయంగా □ ప్రజలు బీఆరఎస్ కావాలని కోరుకుంటున్నారని, బీజేపీ వంటి ఇతర పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా లేరని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జారుడు బండపైన నిలబడిందని, ఇక పుంజుకునే అవకాశమే లేదని వ్యాఖ్యానించారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా, ఎన్ని రకాల అబద్ధాలు చెప్పినా కాంగ్రెస్ పార్టీ ప్రజామోదం పొందడం అత్యంత కష్టమన్నారు.

**ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

జీహెచ్ఎంసీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్ పార్టీ నేతలకు సూచించారు. ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ నియమించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు సరైన శిక్షణ, తగిన ఏర్పాట్లు లేకపోవడంతో ఈ కార్యక్రమం అత్యంత మందకొడిగా కొనసాగుతున్నదని, దీనివల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫీడ్‌బ్యాక్ వస్తోందని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి అత్యధిక జనసాంద్రత ఉండే మహానగరంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫారాల పంపిణీ, వాటిలో ఓటర్ల నమోదు వంటి అంశాలపై సరైన అవగాహన లేకుండానే అధికారులను కేటాయించారంటూ పార్టీ వర్గాలు ఇస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను ప్రస్తావించారు. అయితే ఎస్ఐఆర్ అత్యంత కీలకమైన అంశమని, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగా దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా భారీగా బయటపడిన డబుల్ ఓట్లు, దొంగ ఓట్ల వ్యవహారాన్ని ప్రతి ఒక్క నాయకుడు గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎసఐఆర్‌కు సంబంధించి పార్టీ నియమించుకున్న బూత్ లెవెల్ అసిస్టెంట్ల(బీఎల్ఏ) సహకారంతో ఏ ఒక్కరి ఓటు పోకుండా చూడాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు అధికారంలో ఉన్నందున డబుల్ ఓట్ల నమోదు లేదా ఇతర ప్రాంతాల వారిని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇలాంటి సందర్భంలో కార్యకర్తలు, మద్దతుదారుల ఓట్లు పోయేలా ప్రయత్నం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని, ఏ ఒక్కరి ఓటు అన్యాయంగా తొలగింపునకు గురికాకుండా చూడాలన్నారు. దీంతోపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న డబుల్ ఓట్లపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. మరోవైపు ఎసఐఆర్ కు సంబంధించిన అంశంలో ఎదురవుతున్న ఇబ్బందులను, ప్రజల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఎప్పటికప్పుడు పార్టీ తరఫున తీసుకుపోతున్నట్లు తెలిపారు. నగరంలో ఎసఐఆర్‌కు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు మరింత చురుగ్గా ముందుకు పోవాలన్నారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే, స్థానిక కార్యకర్తలు, పార్టీ బూత్ లెవెల్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జీహెచఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహణే నా కల

- క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, వెబ్‌సైట్ ప్రారంభం
- నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 9**

"హైదరాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహించడమే నా కల. క్రీడాకారులకు ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించి తెలంగాణను దేశంలోనే అగ్ర క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌ను మరోసారి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. 1990 నుంచి 2004 వరకు హైదరాబాద్ అనేక అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చిందని, అయితే గత రెండు దశాబ్దాలుగా ఆ స్థాయి పోటీలు జరగలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా వచ్చే నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అపార జనాభా ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించకపోవడం ఆందోళనకరమని ఆయన అన్నారు. చిన్న వయసులోనే ప్రతిభావంతులను గుర్తించి అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు క్రీడలు కూడా యువతకు ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ తరఫున బిడ్ దాఖలు చేయడం లేదా భారత్‌కు ఆతిథ్య అవకాశం లభిస్తే కనీసం కొన్ని క్రీడా విభాగాలను హైదరాబాద్‌లో నిర్వహించాలన్నదే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ దిశగా గచ్చిబౌలి క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణ, నూతన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

## బండి సాయి భగీరథ్‌కు షరతులతో బెయిల్

- పోక్సో కేసులో తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు
- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశం
- 45 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత ఊరట

**హైదరాబాద్, జూలై 9**

"పోక్సో కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నాం. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలి" అంటూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు పోక్సో చట్టం కింద నమోదైన కేసులో గురువారం తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులతో పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఘటనలో మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. అనంతరం మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా జైలులో ఉన్న భగీరథ్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు.

బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, అతడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువుకు తీవ్ర నష్టం జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ, కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. కాగా, గతంలో బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**హైదరాబాద్, జూలై 9:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్ , సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు, సరఫరా, పరిశ్రమల సహకారం అంశాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా (హైదరాబాద్ మినహా) మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు , అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ చేపట్టిందన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా వెయ్యి నుంచి 1500 ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ. మూడు, నాలుగవ విడతల్లో కూడా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్ధిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన స్టీల్, సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని మంత్రులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం-పరిశ్రమలు-ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని మంత్రులు పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. పరిశ్రమలు, హౌసింగ్ అధికారులు ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని లబ్దిదారునికి ఏవిధంగా మెటీరియల్ చేరవేయాలన్న దానిపై రూట్ మ్యాప్ తయారు చేయాలని మంత్రులు సూచించారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణాదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా

**చింతకాని/ఖమ్మం, జూలై 9 :**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్టేట్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్ క్రాస్ రోడ్, జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు. ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు. రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.

**పంట మార్పిడి విధానం**

వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతోపాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ 'రైతు ఆశీర్వాదం' సభకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు**

మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతోపాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.

## మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

- **రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి**
- **అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ**

**తిరుపతి, జూలై 9:**

కోవిడ్ మహమ్మారి మరోమారు కలవర పెడుతోంది. ఏపీలోని కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్టు సమాచారం. రాజంపేటకు చెందిన వ్యక్తి తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. న్యుమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్య శాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశాలిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం.. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం.. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు.. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం అని డీఎంఈ వివరించారు. గతంలోలాగా భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదని, జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## బస్తీ దవాఖానాల తనిఖీలకు ప్రత్యేక అధికారులు

- **వర్షాకాలం నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**
- **హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం**

**హైదరాబాద్, జూలై 9 :**

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 169 బస్తీ దవాఖానల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను ఈనెల 10వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ తనిఖీలను సమన్వయం చేస్తూ తనతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా రాబోయే రెండు మూడు రోజులపాటు ఎంపిక చేసిన ముఖ్యమైన బస్తీ దవాఖానలను స్వయంగా తనిఖీలు చేస్తామని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు బస్తీ దవాఖానలను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రత్యేక పర్యవేక్షణ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. బస్తీ దవాఖానల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలాగే మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, పరిశుభ్రత, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బస్తీ దవాఖానలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి బస్తీ దవాఖాన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తమ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానలను స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లు అలాగే ఇతర ప్రజాప్రతినిధులు విధిగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బస్తీ దవాఖానలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు నిరంతరం కొనసాగిస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

# గురుకులాల్లో 'పార్ట్ టైం' గందరగోళం

**మొదటిపేజీ తరువాయి**

రహస్యంగా ఖాళీలు.. డెమోల పేరిట హడావుడి 202627 విద్యా సంవత్సరానికి గానూ జూన్ నెలలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పార్ట్ టైం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. సిద్దిపేట జిల్లాకు సంబంధించి వేలాది మంది అభ్యర్థులు హుస్నాబాద్ లోని సాంఘిక సంక్షేమ గురుకులంలో తమ దరఖాస్తులు సమర్పించారు. జూన్ 27న మిట్టపల్లి సీఈఓ (CEO) కార్యాలయంలో డెమో క్లాసులు ఉంటాయని ప్రకటించడంతో వేలాదిగా నిరుద్యోగులు తరలివచ్చారు. అయితే, ఎక్కడెక్కడ ఎన్ని ఖాళీలు ఉన్నాయనే సమాచారాన్ని గురుకుల అధికారులు ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని పోస్టులు లేవని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన అధికారులు.. అన్ని పోస్టులకు డెమోలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, ఖాళీల వివరాలను మాత్రం వెల్లడించకపోవడం వెనుక ఆంతర్యమేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు.

**మాట తప్పిన జీతాలు..**

**ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్య సమాధానాలు**

నోటిఫికేషన్ ప్రకటనలో జూనియర్ లెక్చరర్ (JL) పోస్టుకు రూ. 23,000, పీజీటీ (PGT) మరియు టీజీటీ (TGT) ఉద్యోగాలకు రూ. 18,200 జీతం ఇస్తామని పేర్కొన్నారు. తీరా డెమోల్లో ఎంపికై, స్కూళ్లలో జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చేందుకు వెళ్లిన అభ్యర్థులకు ప్రిన్సిపాల్స్ షాక్ ఇచ్చారు.

"మీ స్కూల్లో పోస్ట్ ఖాళీ లేదు.. అయినా తీసుకుంటున్నాం కాబట్టి రూ. 15,000 మాత్రమే ఇస్తాం. ఇష్టముంటే చేయండి, లేదంటే వెళ్ళిపోండి" అంటూ కొందరు ప్రిన్సిపాల్స్ ముఖం మీదే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు.

సూపర్‌విజన్ డ్యూటీలు, సెల్ఫ్ స్టడీ, నైట్ స్టేలు, హాలిడే, లంచ్ డ్యూటీల పేరిట గొడ్డు చాకిరీ చేయించుకుంటూ.. కేవలం రూ. 15,000 నుండి రూ. 16,000 మాత్రమే ఇస్తామనడంపై అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిందీ టీజీటీ పోస్టులకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ ఇచ్చినప్పటికీ.. 'వర్క్ లోడ్ లేదు' అనే సాకుతో కేవలం రూ. 15,000 మాత్రమే ఇస్తామని తెగేసి చెబుతున్నట్లు సమాచారం.

**ఆరు రోజుల ముచ్చటేనా? నియామకాల రద్దు!**

గత శుక్రవారం ఎన్నో ఆశలతో విధుల్లో చేరిన కొత్త అభ్యర్థుల ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. నియామక ప్రక్రియలో అన్యాయం జరిగిందంటూ కొందరు అభ్యర్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. అధికారులు ఏకంగా ఈ నియామక ప్రక్రియనే రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆరు రోజులుగా పాఠశాలలకు వెళ్తూ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను.. బుధవారం నాడు ఒక్కసారిగా స్కూల్ నుండి వెళ్ళిపోవాలని ప్రిన్సిపాల్స్ ఆదేశించారు. తదుపరి ప్రక్రియను త్వరలోనే పేపర్ ప్రకటన ద్వారా తెలియజేస్తామని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో అభ్యర్థులు లబోదిబోమంటున్నారు.

**కలెక్టర్ పర్యవేక్షణలోనే ఇలాగైతే ఎలా?**

గురుకుల పార్ట్ టైమ్ ఉద్యోగుల నియామకాలు కలెక్టర్ స్థాయి పర్యవేక్షణలో జరిగినప్పటికీ.. ఇలా అర్ధాంతరంగా రద్దు చేయడంపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో డెమోలను మధ్యలోనే నిలిపివేయగా, సిద్దిపేట లాంటి జిల్లాల్లో నియామకాలు పూర్తి చేసి, విధుల్లో చేరిన వారిని తొలగించడం దారుణమని మండిపడుతున్నారు. తమ ఆశలతో, జీవితాలతో ఆడుకునే హక్కు అధికారులకు, ప్రభుత్వానికి ఎవరిచ్చారని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, విధుల్లో చేరిన పార్ట్ టైం ఉద్యోగులను యథావిధిగా కొనసాగించాలని, నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగానే టీజీటీ, పీజీటీలకు రూ. 18,200, జేఎల్స్ కి రూ. 23,000 వేతనం అందించి న్యాయం చేయాలని నిరుద్యోగులు వేడుకుంటున్నారు.

## కమిషన్లతోనే కాలం వెళ్లదీస్తోన్న కాంగ్రెస్

**సిద్దిపేట, జూలై 9:**

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి జలాలు ప్రజలందరికీ కనిపిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాత్రం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. గురువారం సిద్దిపేటలోని పటేల్ గార్డెన్‌లో సిద్దిపేట లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యుల కోసం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కాళేశ్వరం కూలిపోయిందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, రాజకీయంగా బీఆర్ఎస్‌ను దెబ్బతీయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో కాళేశ్వరం జలాలతోనే విస్తారంగా సాగు జరిగి, ధాన్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. గోదాములు నిండిపోయి ధాన్యం తరలించేందుకు లారీలు కూడా దొరకని పరిస్థితి నెలకొందని చెప్పారు. గురుకులాల్లో కోడిగుడ్లు, బూట్లు, యూనిఫాంల నుంచి రవాణా శాఖలో రేడియం స్టిక్కర్ల వరకు ప్రతి అంశంలో కమిషన్లే నడుస్తున్నాయని ఆరోపించారు. గతంలో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే రేడియం స్టిక్కర్లకు ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్న హరీశ్ రావు, లారీ యజమానులు, డ్రైవర్లు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి తన సొంత ఖర్చుతో కళ్లద్దాలు, కంటి శస్త్రచికిత్సలు చేయిస్తానని, వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సిద్దిపేట లారీ అసోసియేషన్‌కు ప్రత్యేక పార్కింగ్ స్థలం కేటాయించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ ఖాతాలోని రూ.1,400 కోట్లపై విచారణ జరపాలి

**మొదటిపేజీ తరువాయి**

కుటుంబాలకు పంపిణీ చేయాలి" అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో కార్మికులతో సమావేశమైన ఆమె, అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కార్మికులకు అవసరమైన మైనింగ్ పరికరాలు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అధికారులకు ఒక నిబంధన, రాత్రింబవళ్లు శ్రమించే కార్మికులకు మరో నిబంధన అమలు చేస్తున్నట్లు యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి కారణంగా తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్తున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 38 వేలకు తగ్గిపోయిందని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, శాశ్వత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వారసత్వ ఉద్యోగాల కోసం ప్రతి నెల కనీసం రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని కవిత కోరారు. డిపెండెంట్ ఉద్యోగాల అంశంపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఈ నెల 20 నుంచి రామగుండంలో నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు.

## 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, జూలై 9**

"టీజీఎస్ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నాం. ఈ నియామకాలకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉండదు. టెన్త్ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి అభ్యర్థులను ఎంపిక చేస్తాం" అని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో చాలా సంవత్సరాల తర్వాత శాశ్వత ప్రాతిపదికన కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 1,500 పోస్టులను భర్తీ చేయనున్న ఈ నియామక ప్రక్రియను ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా నిర్వహించనుంది. పోటీ పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగం లభించే అవకాశం ఉండటంతో నిరుద్యోగ యువతలో ఆసక్తి నెలకొంది.

ఈ నియామకాల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా జరగనుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లు, రోస్టర్ విధానాన్ని అనుసరించి మెరిట్ జాబితాను రూపొందించి నేరుగా నియామకాలు చేపట్టనున్నారు. దీంతో రాత పరీక్షలు, ఇంటర్వ్యూల అవసరం ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత పర్మినెంట్ ప్రాతిపదికన కండక్టర్ పోస్టులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. గత కొన్నేళ్లుగా ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో ఆర్టీసీలో భారీ సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో సేవలు కొనసాగించారు. ఇప్పుడు శాశ్వత నియామకాలు చేపట్టడం ద్వారా సిబ్బంది కొరతను అధిగమించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే నియామకాలకు ముందు పదో తరగతి అర్హతల విషయంలో ఉన్న సాంకేతిక అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గతంలో మార్కుల విధానం అమల్లో ఉండగా, తర్వాత జీపీఏ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇటీవల మళ్లీ మార్కుల విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో కొందరి సర్టిఫికెట్లలో మార్కులు, మరికొందరివాటిలో జీపీఏ మాత్రమే ఉండటంతో వాటిని ఒకే ప్రామాణిక విధానంలో ఎలా పరిగణించాలనే అంశంపై ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, జీపీఏ మార్పిడి విధానం తదితర వివరాలను నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు.

## ఏడేళ్ల ప్రేమ.. మరొకరితో పెళ్లి

**రాజన్న సిరిసిల్ల, జూలై 9**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామంలో ప్రేమ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఏడేళ్లుగా ప్రేమలో ఉన్న యువతి తనను కాకుండా మరొకరిని వివాహం చేసుకోబోతుందని ఆరోపిస్తూ ఓ యువకుడు గ్రామమంతా పోస్టర్లు అతికించడం కలకలం రేపింది. యువతి, కాబోయే వరుడి ఫొటోలతో కూడిన ఈ పోస్టర్లు గ్రామంలోని కూడళ్లు, ప్రధాన రహదారులు, గోడలపై ప్రత్యక్షమవడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోస్టర్లలో యువకుడు.. గత ఏడేళ్లుగా తాము ప్రేమించుకుంటున్నామని, ఈ విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలిసినా బలవంతంగా వేరొకరితో వివాహం నిశ్చయించారని ఆరోపించాడు. తమ ప్రేమ వ్యవహారం గురించి కాబోయే వరుడికి కూడా వివరించినప్పటికీ, అతడు 16 తులాల బంగారం తీసుకుని పెళ్లికి అంగీకరించాడని పోస్టర్లలో పేర్కొన్నాడు. ఈ పెళ్లిని నిలిపివేయాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ పోస్టర్లు అంటించాడు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ కుటుంబ పరువుకు భంగం కలిగేలా తప్పుడు ప్రచారం చేశారని, పోస్టర్లు అంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టర్లను ఎవరు ముద్రించారు, వాటిని ఎవరు గ్రామంలో అతికించారు, అందులో చేసిన ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందనే అంశాలపై విచారణ కొనసాగిస్తున్నారు.



# గందరగోళంలో వ్యవసాయం

## ఎల్‌నినో ముప్పుతో అన్నదాతల తీవ్ర ఆందోళన

## జూలై మధ్యకు వచ్చినా కరువైన వర్షాలు

## ఎండిపోతున్న నార్లు.. దిక్కుతోచని స్థితిలో రైతాంగం

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటికే వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎల్‌కనినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన డంతో రైతు కుదేలవుతున్నాడు. మ-రోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకో వాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెక్కేందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

# పీఓకేలో ఉద్రిక్తతలు పతాకస్థాయికి


- పాక్ ప్రభుత్వానికి 48 గంటల అల్టిమేటమ్
- 38 డిమాండ్లతో జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ హెచ్చరిక
- నామినేటెడ్ అసెంబ్లీ స్థానాలపై తీవ్ర అభ్యంతరం



**ఢిల్లీ, జూలై 9:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో రాజకీయ ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. పాక్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తమ డిమాండ్లను 48 గంటల్లోగా అమలు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పాక్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. పీఓకే అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూనే రాజకీయంగా తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు పాక్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జేఏఏసీ ఆరోపించింది. ముఖ్యంగా పీఓకే అసెంబ్లీలోని 12 నామినేటెడ్ స్థానాలను పాక్ నుంచి వలస వచ్చిన వారి కోసం కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పాక్ నుంచి వలస వచ్చిన సుమారు 4.36 లక్షల మంది ఓటర్ల కోసం 12 అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తుండగా, పీఓకేలోని 33 లక్షల మంది స్థానిక ఓటర్లకు కేవలం 33 స్థానాలే ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జేఏఏసీ విమర్శించింది. ఈ నామినేటెడ్ స్థానాలకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని పాక్ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ స్థానాలను వెంటనే రద్దు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేసింది. అలాగే నిలిచిపోయిన జలవిద్యుత్ ప్రాజెక్టులపై చర్చలు పునఃప్రారంభించడం, నిత్యావసర వస్తువులపై సబ్సిడీలు పెంచడం, విద్యుత్ చార్జీలు తగ్గించడం సహా మొత్తం 38 డిమాండ్లను ప్రభుత్వానికి సమర్పించింది. ఇదిలా ఉండగా, జూలై 27న పీఓకే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం నుంచి అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జేఏఏసీ ఈ అల్టిమేటమ్ జారీ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పాక్ ప్రభుత్వం ఈ డిమాండ్లపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# న్యూజిలాండ్ పర్యటనకు మోదీ

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన




**ఆక్లాండ్/న్యూఢిల్లీ, జూలై 9:** భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనకు ఒక రోజు ముందు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడంతో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు ఎగుమతి అయ్యే 57 శాతం ఉత్పత్తులపై తొలి రోజే దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంతో న్యూజిలాండ్ ఎగుమతిదారులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనలు ముగించుకుని ప్రధాని మోదీ జూలై 10న ఆక్లాండ్ చేరుకోనున్నారు. గత 40 ఏళ్లలో భారత ప్రధాని అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వచ్చే 95 శాతం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను దశలవారీగా తొలగించనున్నారు. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యం 1.3 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరగా, 2024లో సేవల రంగంతో కలిపి ఇది 2.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ప్రయాణ, సమాచార సాంకేతిక, వ్యాపార సేవలు కీలక పాత్ర పోషించాయి. మోదీ-లక్సన్ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే భారత 'యాక్ట్ ఈస్ట్' విధానం, 'మహాసాగర్' దృష్టికోణం, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి సంబంధించి కూడా కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రధాని మోదీ ఈ పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మరోమారు కలవర పెడుతున్న కోవిడ్

## రాజంపేటకు చెందిన వ్యక్తి కోవిడ్‌తో మృతి

## అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ



**తిరుపతి, జూలై 9:** కోవిడ్ మరోమారు కలవర పెడుతోంది. కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి(52) కొవిడ్ కారణంగా చనిపోవడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల్లో ఆరా తీయగా కడప, తిరుపతి జిల్లాల్లో 5 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు గుర్తించింది. దీంతో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖలు రాశారు. కొవిడ్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న ఐసోలేషన్ బెడ్లు, ఐసీయూ పడకలు, ఆక్సిజన్ సౌకర్యం, వెంటిలేటర్లు, మందులు, ర్యాపిడ్ కిట్లు, అంబులెన్స్ వంటి వైద్య సిబ్బంది వివరాలతో నివేదిక పంపాలని ఆదేశించారు. ఇటీవల నమోదైన కేసుల నేపథ్యంలో అవసరమైతే వెంటనే చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించినట్లు సమాచారం.కడప జిల్లా రాజంపేటకు చెందిన ఒక వ్యక్తి (52) తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గత నెల 24న వేలూరు సీఎంసీలో చికిత్స నిమిత్తం చేరారు. నిమోనియా వ్యాధిని గుర్తించారు. అనుమానంతో కొవిడ్ పరీక్ష చేయగా 26వ తేది పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతూ 28న మృతిచెందడంతో వైద్యశాఖ అప్రమత్త మైంది. కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంఈ ఆదేశిచ్చారు. రుయాలో కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశాం. కొవిడ్ టెస్ట్ కిట్లు, సిబ్బంది, అవసరమైన మందులతో సిద్ధంగా ఉన్నాం. రుయాలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదుకాలేదు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో తీవ్రమైన లక్షణాలు లేవని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. కరోనాతో గతంలో లాగా భయపడాల్సిన పనిలేదు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారు అశ్రద్ధ చేయకూడదు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# స్థిరంగా బంగారం

**హైదరాబాద్, జూలై 9:** అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు క్రమంగా తగ్గుదల నమోదు చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,43,120గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,31,190గా ఉంది.మరోవైపు వెండి ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల నమోదైంది. కిలోకు వంద రూపాయల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,44,900గా ఉంది.



# ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

## దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు

## కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం

**వాషింగ్టన్, జూలై 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధిపుల కేసులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూమ్‌లో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌నకు సంబంధించిన ఏకైక సివిల్ కేసు కాదు. 2024లో పరువు నష్టం కేసులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ కేసు కూడా ప్రస్తుతం న్యాయపరమైన ప్రక్రియలో కొనసాగుతోంది.







## వనమహోత్సవం సందర్భంగా గీతాంజలి ది గ్లోబల్ స్కూల్ లో

# ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

**కొండాపూర్, రాజముద్ర న్యూస్:** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వనమహోత్సవం సందర్భంగా గీతాంజలి ది గ్లోబల్ స్కూల్, కొండాపూర్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. కొండాపూర్‌లోని తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ 8వ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు ఉత్సాహంగా పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంత ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్పీ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. రాంబాబు, జేఏ ఎస్ఐ సత్యనారాయణ, పీఆర్ఓ ఎస్ఐ ఎ. మహేందర్ రెడ్డి, గీతాంజలి ది గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ డీవీఎన్ రావు, ప్రిన్సిపాల్ అక్షిత అగ్నిహోత్రి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించేలా విజయవంతంగా సాగిందన్నారు.






## అంగన్వాడి చిన్నారులకు దుస్తులు అందజేత




**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామరెడ్డి మండల కేంద్రంలోనీ అంగన్వాడి కేంద్రం సెంటర్ 107 లో ప్రభుత్వంఅందజేసిన చేసిన నూతన యూనిఫాం డ్రెస్సులు అంగన్వాడి చిన్నారులకు పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి 3వ వార్డు సభ్యులు పిప్పరి లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు స్వయంగా డ్రెస్సులు అందజేశారు, చిన్నారులు కొత్త యూనిపామ్ లు ధరించి ఆనందంగా కనిపించగా తల్లితండ్రులు కూడా ప్రభుత్వనికి, స్థానిక ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా 3వ వార్డు సభ్యులు పిప్పరి లింబాద్రి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు ప్రతి చిన్నారికి తొలి విద్యాలయాలు అని తెలిపారు అలాగే చిన్ననాటి నుండి విద్యతోపాటు, ఆరోగ్యం, క్రమశిక్షణ వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవడానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడి టీచర్ మాధవి గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'సర్' పై బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### పులి శివ కుమార్



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై ఏజెంట్లకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ అన్నారు. సర్ ఉద్దేశాన్ని, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ఈ విధానాలపై ఉన్న అపోహలను తొలగింపజేయలని ఆయన బీఎల్ఏలకు సూచించారు. గురువారం బాలానగర్ లోని రాజు కలని కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన కూకట్పల్లి నియోజకవర్గ బాలానగర్ డివిజన్ బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్ఏ)లతో అవగాహన సమావేశంలో అయన ముఖ్య అధితిగా హాజరై 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)' విధి విధానాలు వివరించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు ఓటర్ల జాబితా నుండి తొలగింపు లేకుండా చూడాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రేణుక, మేడ్చల్-మల్కాజ్గిరి అధికార ప్రతినిధి మధుమోహన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యాదగిరి గౌడ్, సదానందం గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రవి గౌడ్, కోఆర్డినేటర్ గజానంద్ శేఖర్, మహేందర్, హాజి, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల విధానములో మార్పులు

**రామంతపూర్, జులై 8, రాజముద్ర న్యూస్:** ప్రాక్టికల్స్ పరీక్షల విధానములో ఇంటర్ బోర్డు కీలక మార్పులు చేసింది, ఇప్పటివరకు కేవలం సెకండ్ ఇయర్ లో మాత్రమే నిర్వహించే ప్రాక్టికల్స్ విధానానికి స్వస్తి పలికి ఇకపై ఫస్ట్ ఇయర్,సెకండ్ ఇయర్ లోను ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి ఒక అధికారి క సర్క్యులర్‌ను విడుదల చేసింది. నూతన విధానం ప్రకారం రెండు సంవ త్సరాల్లోనూ బోర్డు నియమించే ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్ల పర్యవేక్షణలోనే ఈ పరీక్షలు జరగనున్నా యి. సైన్స్ సబ్జెక్టుల థియరీ పరీక్షలు యథాతథం గా 60 మార్కులకే ఉంటాయి. అయితే, ప్రాక్టికల్స్ విధానాన్ని పునర్వ్యవస్థీకరించి ప్రథమ సంవత్సరానికి 15 మార్కులు, ద్వితీ య సంవత్సరానికి 15 మార్కుల చొప్పున కేటాయించారు.ఇంటర్ మొదటి సంవత్సరం సైన్స్



ప్రాక్టికల్ పరీక్షను 1 గంట 30 నిమిషాల వ్యవధిలో నిర్వహించ నున్నారు. వీటికి సంబంధించిన ప్రాక్టికల్ సిలబస్, మోడల్ క్వశ్చన్ పేపర్లు, నెలవారీ షెడ్యూల్‌తో కూడిన ల్యాబ్ మాన్యువల్స్‌ను బోర్డు ఇప్పటికే తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.ఈ నూతన విద్యా విధానాన్ని పక్కాగా అమలు చేయాలని రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల కు ఇంటర్ బోర్డు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వార్షిక అకాడమిక్ ప్లాన్ ప్రకారం... రెగ్యులర్‌గా ప్రాక్టికల్ తరగతులు నిర్వహిం చాలని, పరీక్షల నాటికి విద్యార్థులు అన్ని ప్రయోగాలు పూర్తి చేసేలా చూడాలని పేర్కొంది. విద్యార్థులు తప్పనిసరిగా సర్టిఫైడ్ ప్రాక్టికల్ రికార్డ్ బుక్‌ను పరీక్ష సమయంలో సమర్పించాల్సి ఉంటుందని, ల్యాబ్‌లలో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు మార్కులను ఎప్పటిక ప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షించ నున్నారు.

## మహిళా న్యాయవాదిపై దాడి అమానుషం






- **పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరిన బాధితురాలు**
- **పోలీసుల నిర్లక్ష్య ధోరణి పట్ల అసహనం వ్యక్తం చేసిన మల్లుల శిరీష**

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళా న్యాయవాదిపై జరిగిన దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత న్యాయవాది మల్లుల శిరీష తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలోనే తనపై దాడి జరిగినప్పటికీ నిందితులు ఇప్పటికీ బయటే స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆమె ఆరోపించారు. బాధితురాలి కథనం ప్రకారం.. స్థానిక రౌడీలతో పాటు అలేటి మోహన్ రెడ్డి, వెంకటేష్ నారోజి, ప్రవీణ్ నారోజి, ప్రవీణ్ భార్య, తల్లి, మేఘనాథ్ తదితరులు కలిసి తనపై దాడికి పాల్పడ్డారు. ఈ వ్యక్తులపై సీనియర్ సివిల్ జడ్జి తనకు అనుకూలంగా మధ్యంతర నిషేధాజ్ఞ (ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. దాడి జరిగిన సమయంలో తన క్లయింట్లకు సంబంధించిన కీలకమైన కేసు ఫైళ్లు, పత్రాలు, ఇతర ముఖ్యమైన మెటీరియల్‌ను నిందితులు బలవంతంగా ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం ఆ మెటీరియల్ మొత్తం నిందితుల వద్దే ఉన్నా, వాటిని స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ఎలాంటి ప్రయత్నమూ చేయడం లేదు. ఈ వ్యవహారంపై స్పందించిన హైకోర్టు.. నిందితుల వద్ద ఉన్న కేసు మెటీరియల్‌ను వెంటనే తిరిగి స్వాధీనం చేసుకుని బాధితురాలికి రక్షణ కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ స్థానిక పోలీసులు ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదు. దొంగతనం, అక్రమ ప్రవేశం లాంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, పోలీసులు ఈ ఘోరాన్ని కేవలం సాధారణ క్రిమినల్ ఫిర్యాదుగా నమోదు చేసి కంటితుడుపు చర్యలతో సరిపెట్టారు. ప్రభావవంతమైన వ్యక్తులను కాపాడేందుకే దర్యాప్తును పక్షపాతంగా సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టంపై అవగాహన ఉన్న ఒక మహిళా న్యాయవాదికి, కోర్టు ఆదేశాలు ఉన్నా న్యాయం జరగకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని బాధితురాలు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయాలని, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత న్యాయవాదికి మద్దతుగా కొందరు సహచర న్యాయవాదులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతి యువకుల కోసం మై భారత్ పోర్టల్ ద్వారా యువకులు రిజిస్ట్రేషన్చేయించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాల వివరాలు పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, ఇతర జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బొగ్గుగని కార్మికుల 12వ వేజ్ బోర్డు తొందరగా సాధించాలి



**రాజముద్ర న్యూస్, తాండూర్:** బొగ్గు గని కార్మికుల 12వ వేజ్ బోర్డు తొందరగా సాధించాలని టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి వర్క్షాప్, ఏరియా స్టోర్స్లో ఫిట్ సెక్రటరీ గాజలేని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వేతన ఒప్పంద కాలపరిమితి ముగిసిందని, జూలై 1 నుంచి 12వ వేతన ఒప్పంద కాలం ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు జాతీయ కార్మిక సంఘాలు కనీస ఉమ్మడి డిమాండ్ల పత్రాన్ని కోల్ ఇండియా యాజమాన్యానికి సమర్పించలేదని, జేబీసీసీఐ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో బొగ్గుగని కార్మికులు నష్టపోతున్నారని, వెంటనే వేతన ఒప్పంద ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. సింగరేణిలో టెండర్ల ప్రక్రియలో సైట్ విజిట్ విధానాన్ని ప్రవేశపెట్టి అధిక టెండర్ల ద్వారా సంస్థను నిర్వీర్యం చేసే పరిస్థితులు ఏర్పడుతున్నప్పటికీ గుర్తింపు సంఘం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో టీబీజీకేఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని సింగరేణి పరిరక్షణ కోసం పోరాడుతామని తెలిపారు. కేసీఆర్ హయాంలో టీబీజీకేఎస్ సాధించిన కార్మిక హక్కులను వివరించే కరపత్రాలను చదవాలని కార్మికులకు సూచించారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి నామినేటెడ్ పద్ధతిలో తాడిచర్ల బొగ్గు బ్లాక్–2ను సింగరేణికి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, స్టోర్ పిట్ సెక్రటరీ గణపతి, అసిస్టెంట్ సెక్రటరీ సురేష్, నాయకులు వెంకన్న, సూరం వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సంగి ప్రశాంత్, వెంకట్, కనకయ్య వెంకటస్వామి, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్గా అమృతశ్రీ బాధ్యతల స్వీకరణ



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్గా పి.అమృతశ్రీ గురువారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ఆహార భద్రత ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తామని తెలిపారు. ఆహార పదార్థాల తయారీదారులు, పంపిణీదారులు, హోటళ్లు, హాస్టళ్లు, రెస్టారెంట్లు, అలాగే చిరు వ్యాపారాలు నిర్వహించే వారు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్సైట్ www.foscos.fssai.gov.inలో దరఖాస్తు ప్రక్రియతో పాటు పూర్తి సమాచారం ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉందని, వ్యాపారులు వెంటనే అవసరమైన అనుమతులు పొందాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన, పరిశుభ్రమైన వాతావరణంలో తయారైన ఆహారాన్ని మాత్రమే వినియోగదారులకు అందించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఆహార నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారం కోసం 9908978790, 9059809823, 9618554411 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ

## మీసేవ కేంద్రాన్ని ప్రారంభించిన ఆడే గజేందర్



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని వాడూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం ద్వారా సమయంతో పాటు డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువపత్రాలు, పింఛన్ దరఖాస్తులు, వివిధ సంక్షేమ పథకాల దరఖాస్తులు తదితర సేవలను ప్రజలు మీసేవ కేంద్రం ద్వారా సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. డిజిటల్ సేవలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వికారాబాద్ ఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన చార్మినార్ జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహాన్






- ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని (డీపీఓ) సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్న డీఐజీకి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం ఇటీవల పునరుద్ధరించిన (రీనోవేషన్) ఎస్పీ ఛాంబర్ను డీఐజీ ప్రారంభించి పరిశీలించారు. తదనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వివిధ విభాగాలైన డీపీఓ సెక్షన్లు, డీసీఆర్బీ, డీఎస్బీ, డీఏఆర్, పరిపాలనా శాఖలు, రికార్డు విభాగాలు, ఆయుధాగారం, సిబ్బంది నిర్వహణకు సంబంధించిన విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల నిర్వహణ, పరిపాలనా విధానాలు, ఫైళ్ల నిర్వహణ, సేవా రికార్డులు, కార్యాలయ నిర్వహణ విధానాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.bఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్ని విభాగాల పనితీరును పరిశీలించడం జరిగింది. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ఫైళ్ల భద్రపరచడం, పరిపాలనా విధానాలు సక్రమంగా ఉండటం ప్రతి పోలీసు అధికారికి ఎంతో ముఖ్యం. ప్రతి శాఖలో రిజిస్టర్లు, రికార్డులు, కేసు సంబంధిత ఫైళ్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి. కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, పరిశుభ్రత, సమయపాలనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను జాప్యం లేకుండా సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలి. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి అధికారి తన బాధ్యతలను నిర్వర్తించాలి అని డిఐజి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, జిల్లా డిసిఆర్బి డిఎస్పి జానయ్య, వికారాబాద్ డిఎస్పి అంజయ్య, డిటిసి డిఎస్పి శ్రీనివాస్, డి ఎ ఆర్ డిఎస్పి వీరేశ్ అధికారులు, ఇన్స్పెక్టర్ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు , సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# పరిశ్రమల నిర్లక్ష్యం... ప్రజల ఆరోగ్యంపై విషప్రయోగం!

**గాలి, నీరు, నేల కలుషితం.. పెరుగుతున్న అనారోగ్య సమస్యలు.. చర్యలు ఎప్పుడు ?**




**రామంతపూర్, జూలై 9, (రాజముద్ర న్యూస్ ):** పారిశ్రామికీకరణ దేశ అభివృద్ధికి కీలకమైనదే. ఉపాధి, ఆర్థికాభివృద్ధి, ఎగుమతుల పెరుగుదలకు పరిశ్రమలు ప్రధాన ఆధారం. అయితే అదే పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడితే, ఆ అభివృద్ధి ప్రజలకు వరం కాక శాపంగా మారుతుంది. నేడు అనేక పారిశ్రామిక ప్రాంతాల పరిసరాల్లో నివసించే ప్రజలు కాలుష్యపు కోరల్లో చిక్కుకుని అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. గాలి, నీరు, నేల కలుషితమవుతున్నా సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల నుంచి వెలువడే విషపూరిత వాయువులు, రసాయన ధూళి, శుద్ధి చేయని వ్యర్థ జలాలు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కాలుష్య నియంత్రణ వ్యవస్థలను నిలిపివేసి వ్యర్థాలను విడుదల చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కాలుష్య నియంత్రణ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా? అనే ప్రశ్న ప్రజల్లో తలెత్తుతోంది.

**పెరుగుతున్న అనారోగ్య సమస్యలు**

పారిశ్రామిక ప్రాంతాల సమీపంలో నివసించే ప్రజల్లో శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు, కంటి మంటలు, అలర్జీలు, ఆస్తమా, దీర్ఘకాలిక దగ్గు వంటి ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. భూగర్భ జలాల్లో రసాయనాల మోతాదు పెరగడం వల్ల భావితరాల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయానికి తీవ్ర నష్టం పరిశ్రమల వ్యర్థాలు కాలువల ద్వారా వ్యవసాయ భూముల్లోకి చేరడంతో భూమి సారం దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. పంటల దిగుబడి తగ్గడం, నాణ్యత క్షీణించడం, పశువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడడం వంటి సమస్యలు గ్రామీణ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి.

**ప్రశ్నార్థకంగా అధికారుల పర్యవేక్షణ**

కాలుష్య నియంత్రణ సంస్థలు, స్థానిక పరిపాలన, సంబంధిత శాఖల అధికారులు పరిశ్రమలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారా? కాలుష్య ప్రమాణాలను నిజంగా పరిశీలిస్తున్నారా? ప్రజల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నారా? లేక నోటీసులకే పరిమితమవుతున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చట్టాలు ఉన్నా వాటి అమలు సక్రమంగా లేకపోతే ప్రజల ఆరోగ్య రక్షణ ఎలా సాధ్యమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**కఠిన చర్యలే పరిష్కారం**

ప్రజల ఆరోగ్యం కంటే ఏ పరిశ్రమా గొప్పది కాదనే విషయాన్ని ప్రభుత్వం, పరిశ్రమలు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఆధునిక కాలుష్య నియంత్రణ పరికరాల వినియోగాన్ని తప్పనిసరి చేయడంతో పాటు, శుద్ధి చేయని వ్యర్థాలను విడుదల చేసే పరిశ్రమలపై భారీ జరిమానాలు విధించాలి. అవసరమైతే వాటి కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలి. గాలి, నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించే కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి వివరాలను ప్రజలకు పారదర్శకంగా అందుబాటులో ఉంచాలి.

**ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి**

కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని పరీక్షించాలి. తాగునీటి నాణ్యతను నిరంతరం పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ తాగునీటి సదుపాయాలు కల్పించాలి. పరిశ్రమలు కూడా తమ సామాజిక బాధ్యతలో భాగంగా పరిసర ప్రాంతాల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదలకు సహకరించాలి.

ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం అభివృద్ధి పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని బలిపీఠంపై ఉంచడం ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు. పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం ఈ మూడు సమతుల్యంగా సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. కఠిన చట్ట అమలు, నిరంతర పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యంతోనే కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుంది. లేకపోతే విషం వెదజల్లే పరిశ్రమల నీడలో ఆరోగ్యవంతమైన సమాజం కేవలం కలగానే మిగిలిపోతుంది.

# పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్లో మంచిర్యాల జిల్లాకు రెండో స్థానం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2025–26 విద్యా సంవత్సరానికి విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో 360 స్కోర్తో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య, ఇతర అధికారులతో కలిసి పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో 324 స్కోర్తో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన మంచిర్యాల జిల్లా, అన్ని విభాగాల్లో పనితీరును మెరుగుపర్చుకొని ఈ ఏడాది 360 స్కోర్ సాధించి రెండో స్థానానికి చేరుకుందని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రం కూడా తన పనితీరును మెరుగుపర్చుకొని జాతీయ స్థాయిలో 18వ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించడం, 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమం ద్వారా తాగునీరు, విద్యుత్, తరగతి గదుల మరమ్మతులు చేపట్టడం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా ఉన్న వసతి గృహాల్లో అదనపు గదులు, భోజనశాలలు, వంటశా లలు, మరుగుదొడ్లు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, ఇంటర్మీడియట్ బ్లాక్ల నిర్మాణం వంటి చర్యలతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు బలోపేతమయ్యాయని తెలిపారు. పాఠశాలల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సుమారు 50 మంది సభ్యులతో ఎనిమిది తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి 485 పాఠశాలలను సమగ్రంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. అలాగే డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల డిజిటల్ విద్యా విభాగంలో జిల్లా స్కోరు గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్, జంబోజు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు 'చావో రేవో' మ్యాచ్

## నాలుగో టీ20లో గెలుపే లక్ష్యం

## తిలక్ స్థానంలో సంజూకు అవకాశం దక్కే సూచనలు







**ముంబై, , జులై 9 :** ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వరుస పరాజయాలతో వెనుకబడిన టీమిండియా గురువారం జరిగే నాలుగో మ్యాచ్‌లో తప్పక గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో భారత్ ఓటమిపాలైంది. ప్రస్తుతం ఇంగ్లండ్ 2-0 ఆధిక్యంలో ఉండటంతో సిరీస్‌ను నిలబెట్టుకోవాలంటే ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి అయింది. ముఖ్యంగా మూడో టీ20లో భారత బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. జట్టు కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది. ఒక్క బ్యాటర్ కూడా 15 పరుగుల మార్కును దాటలేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో తుది జట్టులో కొన్ని కీలక మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన తిలక్ వర్మ స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. అభిషేక్ శర్మతో కలిసి యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఓపెనింగ్ కొనసాగించే అవకాశం ఉంది. గత రెండు మ్యాచ్‌ల్లో పెద్ద స్కోర్లు చేయకపోయినా అతని దూకుడు బ్యాటింగ్‌పై మేనేజ్‌మెంట్ విశ్వాసం ఉంచింది. మూడో స్థానంలో వికెట్‌కీపర్ ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్లుగా శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా తమ స్థానాలను నిలబెట్టుకోనున్నారు. బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్ పేస్ బాధ్యతలు పంచుకోగా, వరుణ్ చక్రవర్తి ప్రధాన స్పిన్నర్‌గా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. అంచనా భారత జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజూ శాంసన్ లేదా తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి.

# లార్డ్స్ టెస్టుకు భారత్‌కు ఎదురుదెబ్బ





**ముంబై, జులై 9:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో నిరాశపరిచిన భారత జట్టు ఇప్పుడు లార్డ్స్‌లో చారిత్రాత్మక టెస్టుకు సిద్ధమైంది. శుక్రవారం ఇంగ్లండ్‌తో జరిగే ఏకైక టెస్టులో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. అయితే మ్యాచ్‌కు ముందే భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ప్రతీకా రావల్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమైంది. గత వారం ఇండియా-ఏ, ఇంగ్లండ్-ఏ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ ప్రతీకా రావల్ మోకాలికి గాయమైంది. గాయం తీవ్రత కారణంగా ఆమె ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో లార్డ్స్ టెస్టులో ఆడే అవకాశం కోల్పోయింది. ప్రధాన కోచ్ అమోల్ మజుందార్ మాట్లాడుతూ.. ప్రతీక మోకాలికి గాయం కావడంతో కుట్లు పడ్డాయని, అందుకే ఆమెను జట్టు నుంచి తప్పించాల్సి వచ్చిందని తెలిపారు. ఆమె స్థానంలో అనుభవజ్ఞురాలైన ప్రియా పూనియాను జట్టులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే ప్రతీకా రావల్ స్థానంలో మూడో స్థానంలో ఎవరు బ్యాటింగ్‌కు దిగుతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ స్థానానికి యస్తికా భాటియా, హర్లీన్ డియోల్ మధ్య పోటీ నెలకొంది. జట్టు సమతూకాన్ని దృష్టిలో పెట్టుకుని తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 150 ఏళ్ల చరిత్ర కలిగిన లార్డ్స్ మైదానంలో జరుగుతున్న తొలి మహిళల టెస్టులో ఆడే అవకాశం భారత జట్టుకు దక్కింది. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరచి, ఈ చారిత్రాత్మక మ్యాచ్‌లో విజయంతో పర్యటనను ముగించాలని హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పట్టుదలగా ఉంది. భారత జట్టు: స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రీచా ఘోష్ (వికెట్ కీపర్), శ్రీ చరణి, యస్తికా భాటియా (వికెట్ కీపర్), నందిని శర్మ, హర్లీన్ డియోల్, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘారే, స్నేహ్ రానా, ప్రియా పూనియా.

# భారత్‌కు డబ్ల్యూటీసీలో ఐదో స్థానం




**ముంబై, జులై 9:** వెస్టిండీస్-శ్రీలంక టెస్టు సిరీస్ ముగిసిన అనంతరం 2025--27 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తాజా పాయింట్ల పట్టిక విడుదలైంది. ఈ పట్టికలో 87.50 శాతం పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా రెండో, న్యూజిలాండ్ మూడో స్థానాల్లో నిలిచాయి. 58.33 శాతం పాయింట్లతో బంగ్లాదేశ్ నాలుగో స్థానాన్ని దక్కించుకోగా, భారత్ 48.15 శాతం పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు ఆడిన భారత జట్టు నాలుగు విజయాలు, నాలుగు పరాజయాలు, ఒక డ్రాతో మొత్తం 52 పాయింట్లు సాధించింది. తాజా పట్టికలో శ్రీలంక ఆరో స్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, పాకిస్థాన్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నాయి. ఓవర్‌రేట్ నిబంధనల ఉల్లంఘన కారణంగా ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్లకు పాయింట్ల కోత విధించబడింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ మిగిలిన టెస్టు సిరీస్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. రాబోయే మ్యాచ్‌ల ఫలితాలే భారత జట్టు ఫైనల్ అవకాశాలను నిర్ణయించనున్నాయి.

# తిలక్‌పై శ్రీకాంత్ అసంతృప్తి..

## సంజూకు అవకాశం ఇవ్వాలని సూచన




**ముంబై, జులై 9 :** ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు వరుస పరాజయాలు ఎదుర్కొంటుండటంతో జట్టు ఎంపిక, ఆటగాళ్ల ప్రదర్శనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఆటతీరుపై భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిలక్ స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన శ్రీకాంత్, తిలక్ వర్మ ప్రస్తుతం పూర్తిగా అయోమయంలో కనిపిస్తున్నాడని అన్నారు. వైస్ కెప్టెన్‌గా నియమించిన ఆటగాడిని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. తన స్థానంలో అయితే సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకుంటానని పేర్కొన్నారు. తిలక్‌కు షార్ట్ పిచ్ బంతులు బలహీనత అని తెలిసినా, అతడిని రక్షించేందుకు అక్షర్ పటేల్‌ను ముందుగా బ్యాటింగ్‌కు పంపడం సరైన నిర్ణయం కాదని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి నిర్ణయాల ద్వారా జట్టు యాజమాన్యం తప్పుడు సంకేతాలు పంపుతోందని ఆయన విమర్శించారు. వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తిలక్ వర్మ 19, 55, 13, 24 నాటౌట్, 3 పరుగులు మాత్రమే నమోదు చేశాడు. ఐర్లాండ్‌పై చేసిన అర్ధశతకం మినహా మిగిలిన మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఇక ఇంగ్లండ్ పర్యటనలో భారత బ్యాటింగ్ విభాగం వరుసగా విఫలమవుతుండటంతో జట్టు ఎంపిక, నాయకత్వ నిర్ణయాలపై మాజీ క్రికెటర్లు, అభిమానుల నుంచి విమర్శలు పెరుగుతున్నాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి మార్పులు చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




## బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ వీడియోపై


# ఐసీసీ ఆగ్రహం..

## ఈసీబీకి నోటీసు

**లండన్, జులై 9 :** ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు మ్యాచ్ మధ్యలోనే ప్రకటించాడనే వార్త క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మ్యాచ్ కొనసాగుతున్న సమయంలో ఆయన రిటైర్మెంట్‌కు సంబంధించిన వీడియో బయటకు రావడంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డుకు నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్లు సమాచారం. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న మూడో టెస్టు నాలుగో రోజు ఆట ప్రారంభానికి ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో బెన్ స్టోక్స్ తన సహచర ఆటగాళ్లతో ఇదే తన చివరి టెస్టు అని చెప్పినట్లు ప్రచారం జరిగింది. ఆ సమయంలో ఈసీబీ మీడియా బృందం వీడియో చిత్రీకరించగా, అదే రోజు టీ విరామం సమయంలో ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో చిత్రీకరించిన వీడియోను బహిర్గతం చేయడం ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని ఐసీసీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని ఈసీబీని కోరినట్లు సమాచారం. ఇక ఈ వివాదంపై బెన్ స్టోక్స్ కూడా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. తనపై చర్యలు తీసుకోవచ్చంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వ్యవహారంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన వెలువడలేదు. అయితే, బెన్ స్టోక్స్ రిటైర్మెంట్, ఐసీసీ చర్యలకు సంబంధించిన ఈ సమాచారం అధికారికంగా పూర్తిస్థాయిలో ధృవీకరించబడే వరకు ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది.

# అర్జెంటీనాకు చుక్కలు చూపించిన ఈజిప్ట్ కోచ్‌కు బంపర్ ఆఫర్

**కైరో, జులై 9 :** ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచకప్‌లో ఈజిప్ట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరచడంతో ఆ జట్టు ప్రధాన కోచ్ హెూసామ్ హసన్ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం ప్రకటించింది. జట్టు సాధించిన విజయాలు, అంతర్జాతీయ స్థాయిలో కనబరిచిన పోరాట పటిమను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మొహమ్మద్ సలా నాయకత్వంలోని ఈజిప్ట్ జట్టు 2018 తర్వాత మ-రోసారి ప్రపంచకప్‌లో పాల్గొని రౌండ్ ఆఫ్ 16కు చేరి అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా ప్రీ-క్వార్టర్‌లో అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో ఒక దశలో 2-0 ఆధిక్యంలో నిలిచి సంచలన విజయానికి చేరువైంది. అయితే అర్జెంటీనా వరుసగా మూడు గోల్స్ నమోదు చేసి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకుంది. ఓటమి పాలైనప్పటికీ ఈజిప్ట్ ఆటతీరుపై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు హానీ అబో రిడా మాట్లాడుతూ హెూసామ్ హసన్‌తో పాటు జట్టు డైరెక్టర్ ఇబ్రహీం హసన్ ఒప్పందాల పునరుద్ధరణకు సంఘం పాలక మండలి ఆమోదం తెలిపిందని వెల్లడించారు. జట్టుకు దీర్ఘకాలిక స్థిరత్వం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 59 ఏళ్ల హెూసామ్ హసన్ 2024 ఫిబ్రవరిలో ఈజిప్ట్ జాతీయ జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అతని మార్గదర్శకత్వంలో జట్టు 2025 ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అధికారిక ఒప్పందం లేకుండానే జట్టుతో కలిసి పనిచేస్తున్నట్లు హసన్ గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే. హసన్ శిక్షణలోనే ఈజిప్ట్ ప్రపంచకప్ చరిత్రలో తొలి విజయాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌పై 3-1 తేడాతో గెలిచి చరిత్ర సృష్టించింది. అనంతరం నాకౌట్ దశలో ఆస్ట్రేలియాను పెనాల్టీల ద్వారా ఓడించి ప్రపంచకప్‌లో తొలి నాకౌట్ విజయాన్ని కూడా అందుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం హెూసామ్ హసన్ కొత్త ఒప్పందం 2030 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ నిర్ణయం ద్వారా ఈజిప్ట్ ఫుట్‌బాల్ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సంఘం భావిస్తున్నట్లు సమాచారం.





## వర్షంలో 12 గంటలపాటు ఏకబిగిన

# చిరు షూటింగ్

### మైసా కోసం అండర్ వాటర్‌లో రష్మిక సాహసం

ప్రేక్షకులను అలరించడం కోసం నటీనటులు ఎంత కష్టాన్నైనా భరిస్తారు. పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకుంటారు. ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో చిరంజీవి హీరోగా రానున్న మెగా 158 ఒకటైతే.. రష్మిక ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'మైసా' మరొకటి. ఈ చిత్రాల కోసం అటు చిరు.. ఇటు రష్మిక ఎంతో కష్టపడుతున్నారు. తాజాగా ఈ రెండు సినిమాల అప్‌డేట్స్‌ను ఆయా చిత్రబృందాలు పంచుకున్నాయి. మెగా 158లో వర్షంలో సీక్వెన్స్ కోసం చిరంజీవి 12 గంటలు ఏకధాటిగా షూటింగ్ చేయగా.. 'మైసా' కోసం రష్మిక అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో మెగా158 (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఉదయం 4 గంటలకు వ్యాయామంతో తన రోజును ప్రారంభించే చిరంజీవి నిబద్ధత చూసి మా చిత్రబృందం ఆశ్చర్యపోయింది. అత్యంత కఠినమైన యాక్షన్ సన్నివేశాలను షూట్ చేయడం కోసం 12 గంటలు పట్టింది. వర్షంలో ఉండే ఈ సన్నివేశాన్ని చిరు ఎంతో కష్టపడి పూర్తి చేశారు. అందుకే ఆయన మెగాస్టార్ అయ్యారు అని టీమ్ పోస్ట్ చేసింది.'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె.. గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. తాజాగా అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. సినిమాలో ఈ సన్నివేశం చాలా ఆసక్తిగా ఉంటుందని టీమ్ వెల్లడించింది. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందారు.

# జన నాయగన్ విడుదలకు సిద్ధం

విజయ్ 'జన నాయగన్' కోసం అభిమానులు ఎన్నో నెలల నుంచి ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కారణంగా నిలిచిపోయిన ఈ చిత్రం.. ఈ నెలలోనే విడుదల కావడం దాదాపు ఖాయంగానే కన్పిస్తోంది. దీనిపై కెనడా డిస్ట్రిబ్యూటర్ హింట్ ఇవ్వడంతో మరోసారి విడుదల తేదీపై చర్చ మొదలైంది. కెనడాకు చెందిన ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ యార్క్ సినిమాస్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. 'ఎట్టకేలకు మన దళపతి విజయ్ 'జన నాయగన్' సినిమాతో వెండితెరపై మెరిసేందుకు సిద్ధమయ్యారు. జులై 24 నుంచి కెనడాలో యార్క్ సినిమాస్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తోంది' అంటూ ఓ పోస్టర్ పంచుకుంది. త్వరలోనే టికెట్ బుకింగ్స్ కూడా ఓపెన్ అవుతాయని తన పోస్ట్‌లో తెలిపింది. దీంతో ఈ తేదీకి రావడం దాదాపుగా ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక, దీనికి ఒక రోజు ముందుగానే భారత్‌లోనూ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు చిత్రబృందం అంగీకరించింది. రెండు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పనులు పూర్తికాగానే చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు జులై 24 విడుదలకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సమాచారం అందినట్లు తెలుస్తోంది.




# నేడు విడుదలవుతున్న ..లెనిన్

### మరికొన్ని డబ్బింగ్ మూవీలు కూడా సందడి

ఈ నెల రెండో శుక్రవారం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చిత్రాల సందడి నెలకొనబోతోంది. ఈ వారం టాలీవుడ్ నుంచి అఖిల్ అక్కినేని మోస్ట్ అవేటెడ్ యాక్షన్ డ్రామా 'లెనిన్' నేరుగా థియేటర్లలోకి వస్తుండగా, దీనికి పోటీగా భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు కూడా రేసులో నిలిచాయి. ఇక వైవిధ్యమైన కథాంశాలతో, విభిన్న జోనర్లలో ప్రేక్షకులను అలరించేందుకు ఆసక్తికరమైన చిత్రాలు విడుదలవుతున్నాయి. అఖిల్ అక్కినేని కెరీర్‌లోనే అత్యంత రగ్గడ్ లుక్‌లో కనిపించనున్న యాక్షన్ డ్రామా 'లెనిన్'. మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఒక అందమైన ప్రేమకథ హింసాత్మక మలుపులు తిరిగితే ఎలా ఉంటుందనే కథాంశంతో వస్తున్న ఈ సినిమాను నాగార్జున అక్కినేని, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. థమన్ ఎస్ దీనికి సంగీతం అందించారు. ఇకపోతే మైథాలజీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న చిత్రం 'వాసుదేవ సుతం'. పూరీ జగన్నాథ ఆలయంలో దాగి ఉన్న ఒక పవిత్రమైన శక్తిని రక్షించడానికి ఒక యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా కథ. మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి, సుమేధా బజాజ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి వైకుంఠ్ బోను దర్శకత్వం వహించగా, మణిశర్మ సంగీతాన్ని సమకూర్చారు.ఇకపోతే మలయాళంలో విడుదలై తెలుగులో రాబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'. నిసామ్ బషీర్ దర్శకత్వంలో పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, ఒక భారీ బ్యాంక్ దోపిడీ కేసులో అన్యాయంగా ఇరుక్కున్న ఒక సాధారణ వ్యక్తి తన నిర్దోషిత్వాన్ని ఎలా నిరూపించు కున్నాడు అనే కథతో సాగుతుంది. తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం 'లవ్ ఓ లవ్' కూడా నేడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. మహేష్ రాజేంద్రన్ దర్శకత్వంలో పవిష్ నారాయణన్, నాగ దుర్గ, ఆదిత్య కతిర్ నటించిన ఈ సినిమా, అప్పుల్లో మునిగిపోయిన ఒక యువకుడి ప్రేమకథ చుట్టూ తిరుగుతుంది. ఇందులో ప్రముఖ దర్శకులు సెల్వరాఘవన్, కె. ఎస్. రవికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ప్రేమ, బ్రేకప్ మరియు గుండె లోతుల్లోని భావాల సమాహారంగా వస్తోన్న భావోద్వేగభరిత చిత్రం 'హృదయం మురళి'. అథర్వ మురళి, ప్రీతి ముకుందన్ జంటగా ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో కాయాదు లోహర్, నిహారిక ఎన్.ఎమ్ ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో 'ఇదయం మురళి'గా, తెలుగులో




'హృదయం మురళి'గా ఈ సినిమా రిలీజ్ కానుంది. బాలీవుడ్ నుంచి నవ్వుల పండగను తీసుకురావడానికి 'ధమాల్ 4' వస్తోంది. ఇంద్ర కుమార్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, రితీష్ దేశ్‌ముఖ్, అర్షద్ వార్సి, జావేద్ జాఫేరి, సంజయ్ మిశ్రా, రవి కిషన్ కలయికలో వస్తోన్న ఈ క్రేజీ కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమైంది. ఇలా విభిన్నమైన జోనర్లతో, భారీ సంఖ్యలో డబ్బింగ్ సినిమాలతో ఈ శుక్రవారం బాక్సాఫీస్ కళకళలాడబోతోంది.


# మరో సస్పెన్స్ థ్రిల్లర్.. వదల




సీనియర్ నటుడు జగపతిబాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'వదల' విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రస్తుతం చిత్ర బృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ అత్యంత కీలక పాత్రలో కనిపించనున్నారు. కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ట్రైలర్‌ను గమనిస్తే, మొదట ఒక సాధారణ కుటుంబ కథలా సినిమా ప్రారంభమవుతుంది. ఇరవై ఏళ్లుగా సంతోషకరమైన దాంపత్య జీవితాన్ని గడుపుతున్న దంపతులుగా జగపతిబాబు, లయ కనిపిస్తారు. ఒకరిపై ఒకరికి అపారమైన ప్రేమ, ఆప్యాయతతో జీవిస్తున్న వారి జీవితంలోకి అనూహ్యంగా ఓ యువతి ప్రవేశించడం కథను పూర్తిగా మలుపుతిప్పుతుంది. పక్కింటికి వచ్చిన ఆ యువతి జగపతిబాబు పాత్రపై ప్రమాదకరమైన స్థాయిలో మోజు పెంచుకోవడం, క్రమంగా అది వ్యామోహంగా మారడం ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. అదే సమయంలో లయ పాత్రకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం, కుటుంబంపై ముప్పు పెరగడం కథలోని సస్పెన్స్‌ను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి పోరాడే వ్యక్తిగా జగపతిబాబు కనిపిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు, అనుకోని ప్రమాదం మధ్య చిక్కుకున్న వ్యక్తి పాత్రలో ఆయన నటన ట్రైలర్‌లోనే ఆకట్టుకుంటోంది. లయ కూడా సహజమైన నటనతో కుటుంబ భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది. మరోవైపు హృతిక శ్రీనివాస్ పోషించిన పాత్ర ట్రైలర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె హావభావాలు, డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. దర్శకుడు అకెళ్ల వి. కృష్ణ మరోసారి థ్రిల్లర్ జానర్‌పై తన పట్టు చూపించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కథలో ఎక్కడా సస్పెన్స్ తగ్గకుండా, అదే సమయంలో కుటుంబ భావోద్వేగాలను కూడా సమతుల్యంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ యువతి అసలు ఉద్దేశం ఏమిటి? ఆమె జగపతిబాబు జీవితంలోకి ఎందుకు వచ్చింది? ఈ సంఘటనల వెనుక అసలు నిజం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తిని ట్రైలర్ చివరి వరకు కొనసాగిస్తుంది. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్ థ్రిల్లర్ మూడ్‌ను మరింత బలపరిచాయి. డార్క్ టోన్స్, విజువల్ ఫ్రేమింగ్ కథలోని ఉత్కంఠను పెంచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు కార్తీక్ కోడకండ్ల అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి సన్నివేశానికి అదనపు థ్రిల్‌ను జోడించింది.

# భారీ బడ్జెట్ చిత్రంగా టాక్సిక్

కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ప్రస్తుతం నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్'. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొల్పింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. సినిమా నిర్మాణ వ్యయం దాదాపు రూ.500 కోట్లకు పైగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. యాక్షన్, హింసాత్మక నేపథ్యం, భారీ విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన రెండు గ్లింప్స్‌తో పాటు ఒక పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రచారం ప్రకారం, మొత్తం బ్జడెట్‌లో దాదాపు రూ.100 కోట్లు ప్రధాన తారాగణం, దర్శకురాలు, కీలక సాంకేతిక నిపుణుల రెమ్యూనరేషన్లకే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. హీరో యశ్ ఈ సినిమా కోసం సుమారు రూ.50 కోట్ల పారితోషికం తీసుకుంటున్నారని, అంతేకాకుండా సినిమా లాభాల్లో కూడా వాటా ఉండేలా ఒప్పందం చేసుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీకి సుమారు రూ.15 కోట్లు పారితోషికంగా అందుతున్నట్లు సమాచారం. కీలక పాత్రలో కనిపించనున్న నయనతారకు రూ.12 కోట్లు, మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్న రుక్మిణి వసంత్‌కి రూ.3 కోట్లు ఇస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే తారా సుతారియా, హ్యూమా ఖురేషిలకు చెరో రూ.2 కోట్ల వరకు పారితోషికం చెల్లిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దర్శకురాలు గీతూ



మోహన్‌దాస్‌తో పాటు ఇతర కీలక సాంకేతిక నిపుణుల పారితోషికాలు కలిపితే మొత్తం రెమ్యూనరేషన్ వ్యయం రూ.100 కోట్ల మార్క్‌ను దాటే అవకాశముందని చర్చ జరుగుతోంది. కేవలం నటీనటుల పారితోషికాలే కాకుండా సినిమా నిర్మాణంపైనా భారీగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్లు, ప్రత్యేక ఆర్ట్ డైరెక్షన్, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అందుకే ఆర్ట్ డిపార్ట్‌మెంట్, యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంకేతిక అంశాలపై కూడా నిర్మాతలు భారీగా పెట్టుబడి పెడుతున్నట్లు సమాచారం

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com